క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


ఓంకార్

నెల్లూరు(క్రైమ్) : వ్యక్తి అదృశ్యమైన ఘటనపై ఆదివారం చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట కొండదిబ్బలో జి.ఓంకార్ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మరణించిన వారికి దహన సంస్కారాలు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. అందులో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత ఇంటికి వచ్చేవారు. ఓంకార్ అన్న హరి నందితోట మెయిన్‌రోడ్డులో వినాయకుని గుడి పూజారి. ఈనెల 14వ తేదీ హరి వద్దకు కొందరు వ్యక్తులు వచ్చారు. ఓంకార్ ఉన్నాడా? ఫోన్ చేస్తే తీయడం లేదని చెప్పారు. దీంతో తమ్మునికి హరి ఫోన్ చేయగా స్విచాఫ్‌లో ఉంది. ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. దీంతో చుట్టుపక్కల ఆరాతీశారు. ఏదైనా పనినిమిత్తం ఊరు వెళ్లి ఉంటాడని భావించారు. రోజులు గడుస్తున్నా తమ్ముడు ఇంటికి రాకపోవడంతో హరి ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై బి.రవిప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఓంకార్ ఆచూకీ తెలిసిన వారు 94407 96305, 99633 52179 నంబర్లకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

అల్పాహారం పంపిణీ



నెల్లూరు(బృందావనం) : కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్‌లో ఉన్న జనహిత–వాత్సల్య బాలల, వృద్ధుల కేంద్రంలో ఆదివారం అల్పాహారం అందించారు. పొనకా మల్లికార్జునరెడ్డి– సునంద దంపతుల కుమారుడు శశిధర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తొలుత కేక్ కట్ చేసి మిఠాయిలు, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావు, సిబ్బంది మల్లికార్జునరావు, గిరి పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింగ్–1545 సాధించిన నెల్లూరుకు చెందిన చెస్ క్రీడాకారుడు జి.సాయిసృజన్‌ను రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ ఆదివారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. స్థానిక బాలాజీనగర్‌లోని కేబీ చెస్ అకాడమీలో ఆదివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న సాయిసృజన్ భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారుడిగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమీ కోచ్ కిశోర్, డైరెక్టర్ దుర్గాభవాని పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

• 25 క్వార్టర్ల మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైమ్) : అనధికార మద్యం విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు–1 అధికారులు నగరంలో ఆదివారం దాడులు నిర్వహించారు. డైకస్‌రోడ్డు సెంటర్‌లో బస్టాండ్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నెల్లూరు వెంగళరావ్‌నగర్‌కు చెందిన వి.వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 25 క్వార్టర్‌ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేశారు. అదే క్రమంలో మైపాడురోడ్డు సమీపంలో బహిరంగ మద్య సేవనం చేస్తున్న సురేంద్రబాబు, గౌస్‌బాషాలపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, ఎస్సై మురళీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ ఆదివారం తెలిపారు. పుత్తా ఏస్టేట్, మనుమసిద్ధినగర్, వాకర్స్‌రోడ్డు, పరమేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్ఎంసీలో అర్జీల స్వీకరణ నేడు

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ సహకారంతో సొంతింటి నిర్మాణానికి అర్హులైన వారు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0(పీఎంఏవై) ద్వారా ఈనెల 26వ తేదీన ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

• నగరంలో ఇష్టారీతిగా అక్రమ కట్టడాలు
• పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు


కొత్తూరు సమీపంలోని జర్నలిస్ట్ కాలనీలో అనుమతుల్లేకుండా నిర్మించిన భవనం

నెల్లూరు(బారకాసు) : జిల్లా కేంద్రమైన నెల్లూరు రోజురోజుకు విస్తరిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో జోరుగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే కొందరు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) అనుమతులు తీసుకోకుండానే భవన నిర్మాణాలు యథేచ్ఛగా జరుపుతున్నారు. అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించి ఉన్నారు. అయినా ఇవేమీ పట్టనట్టుగా కొందరు ఇష్టారీతిగా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు.

ముడుపులకే ప్రాధాన్యం

భవన నిర్మాణాలు జరిపే యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంది. అయితే కొందరు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు అందులో ఒకలా, నిర్మాణం మరోలా ఉంటోంది. ఇదంతా తెలిసినా కూడా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు ముడుపులు తీసుకుని అంత సక్రమమే అని నిమ్మకుండిపోతున్నారు. కొంత మంది భవన యజమానులు నిబంధనల మేరకే నిర్మాణాలు జరిపినా కూడా వారు ముడుపులు చెల్లించకపోతే మాత్రం ఏదో ఒక కొర్రీ పెట్టి నిర్మాణాలను అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా టౌన్‌ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణాల విషయంలో ముడుపులకే ప్రాధాన్యం ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా జరిగే నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

జర్నలిస్ట్ కాలనీలో..

నగరానికి కొంత దూరంలో ఉన్న కొత్తూరు సమీపంలో జర్నలిస్ట్ కాలనీ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడి కాలనీలో ఇప్పటికే అనేక భవన నిర్మాణాలు చేపట్టారు. మరికొన్ని నిర్మాణ దశలో ఉండగా మరికొన్ని చివరిదశలో ఉన్నాయి. అయితే ఇందులో పలు భవన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి. మరికొన్ని భవనాలు టౌన్‌ప్లానింగ్ అనుమతి లేకుండానే కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. పైగా ఈ అక్రమ కట్టడాలపై పలువురు పలుమార్లు ఎన్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ నూతనంగా ఓ భవనాన్ని నిర్మించారు. దీనిని చర్చిగా వినియోగించేందుకు తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే భవన నిర్మాణం 90 శాతం పూర్తి చేశారు. దీనికి ఎలాంటి అనుమతులు లేవు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. ఇదొక్కటే కాకుండా ఇక్కడ అనుమతుల్లేని నిర్మాణాలు చాలా ఉన్నాయి. ఆయా భవన యజమానుల నుంచి సదరు టౌన్‌ప్లానింగ్ అధికారులకు పెద్దమొత్తంలో ముడుపులు వెళ్తున్నట్లు విమర్శలున్నాయి. ఇలాగే కొనసాగితే నగరపాలక సంస్థకు రావాల్సిన రాబడి తగ్గిపోనుంది. ఇటీవల నగరపాలక కమిషనర్ తన పర్యటనలో భాగంగా అక్రమ భవన నిర్మాణాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఇదేవిధంగా జర్నలిస్ట్ కాలనీలో అనుమతుల్లేకుండా జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

జర్నలిస్ట్ కాలనీలో అనుమతుల్లేకుండా జరిపే నిర్మాణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. స్థానికంగా ఓ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ప్రస్తుతం నేను 20 రోజుల నుంచి సెలవులో ఉన్నా. విధుల్లోకి రాగానే అక్రమ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– శివ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ

ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో ప్రభుత్వ టిడ్కో గృహ సముదాయంలో రూ.లక్షల విలువైన వంద అంకణాల స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలానికి చెందిన టిడ్కో గృహ సముదాయంలో ప్రైవేటు వ్యక్తులు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకూడదన్న నిబంధన ఉంది. దీనిని పట్టించుకోకుండా కొందరు ఆక్రమించి నిర్మాణాలు జరుపుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.


భగత్‌సింగ్ కాలనీలో చేపట్టిన నిర్మాణం

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

– వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జి విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిసేలా ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. ఈ మేరకు చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను అధికార పార్టీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారని, ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరూ నిరుత్సాహ పడాల్సిన పని లేదని, తామంతా ఉన్నామని, ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేద్దామని, భవిష్యత్తులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకగా కార్తీక వనభోజనోత్సవం


పాల్గొన్న దేవాంగ సంఘీయులు


మాట్లాడుతున్న సంఘం నాయకులు

నెల్లూరు సిటీ : నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాంగణంలో జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం ఆదివారం వేడుకగా జరిగింది. తొలుత దేవాంగ కులదైవమైన చాముండేశ్వరీదేవి, లక్ష్మీనరసింహస్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో సంఘ ఆవిర్భావ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షుడిగా డాక్టర్ మన్నెం సతీష్ వ్యవహరించి, మాట్లాడారు. ఏటా అనేక పథకాలను పేద దేవాంగుల కోసం ప్రవేశపెడుతున్నామన్నారు. అనంతరం విద్యాకానుక పథకం కింద 12 మంది పేద దేవాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. సుమారు 5000 మంది దేవాంగ కుటుంబాలు పాల్గొన్న కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, అసోసియేట్ అధ్యక్షుడు సజ్జ వెంకటసురేష్, కోశాధికారి కొండా మాధవయ్య, చందన బ్రదర్స్ సీఎంఆర్ అధినేత శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ కల్యాణ మండపం అధినేత కన్నా రాఘవరావు, సంఘం గౌరవాధ్యక్షుడు దశరథరామయ్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీ అధికారులకు అవార్డులు


అవార్డు అందుకున్న నరేంద్రబాబు, సుధాకర్‌రావు

నెల్లూరు (టౌన్) : నగరంలోని కేఎన్నార్ మున్సిపల్ స్కూల్ 10 ఆంధ్రా నావెల్ యూనిట్ ఎన్‌సీసీ అధికారి గుండాల నరేంద్రబాబు, ఎన్‌సీసీ పెట్టీ ఆఫీసర్ సుధాకర్‌రావు అవార్డులు అందుకున్నారు. 77వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలను తెలంగాణలోని మెహిదీపట్నం మిల్‌గ్యారీసన్ డిఫెన్స్ గ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎన్‌సీసీసీలో ఉత్తమ సేవలందించినందుకు గుంటూరు గ్రూపు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎం.చంద్రశేఖర్ చేతుల మీదుగా నరేంద్రబాబు, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా సుధాకర్‌రావు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అధికారులకు వార్డుల కేటాయింపు

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన అంతర్గత బదిలీలో భాగంగా హెల్త్ సెక్షన్‌లో ఇన్‌చార్జి శానిటరీ సూపర్‌వైజర్‌గా బదిలీ అయిన ఇద్దరు రెవెన్యూ అధికారులు ఎస్ఏ సమద్, రాజేశ్వరిలకు వార్డులను కేటాయిస్తూ కమిషనర్ సూర్యతేజ ఉత్తర్వులు జారీ చేశారు. వారు బాధ్యతలు స్వీకరించాలన్నారు.

వెన్నెలకంటి సేవలు చిరస్మరణీయం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య సేవలు చిరస్మరణీయమని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో యానాదుల సంక్షేమ సంఘం, యానాది–గిరిజన ఉద్యోగుల సంఘం, ఆదిమ జాతి సేవక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెన్నెలకంటి రాఘవయ్య వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. రాఘవయ్య సేవలను కొనియాడారు.

ప్రజాసంఘాల సంఘీభావం


మాట్లాడుతున్న ప్రజాసంఘాల నేతలు

నెల్లూరు(బృందావనం) : పరమేశ్వరినగర్‌లో మద్యం దుకాణాన్ని తొలగించాలని చేస్తున్న నిరసన కార్యక్రమానికి వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. తక్షణమే మద్యం దుకాణాన్ని తొలగించి వారు డిమాండ్ చేశారు. శీనయ్య, అంబేడ్కర్, శివశంకర్, జాషువా, బాలకృష్ణ, పాటల శీనయ్య, జుబేర్, అబ్దుల్‌ఘని, సయ్యద్ సర్దార్, నవీద్, ఎ.రాయప్ప, జిలాని, అబ్దుల్‌రెహమాన్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను బహిష్కరించాలి

నెల్లూరు (టౌన్) : హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖ అధికారుల రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను బహిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సురేంద్రరెడ్డి, సెక్రటరీ జనరల్ మాసా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇతర జిల్లాల్లో ట్రైనింగ్ నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ఫ్యాప్టో రాష్ట్ర శాఖ పలుమార్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఒప్పుకుని ఇప్పుడు పాత పద్ధతిలోనే కొనసాగిస్తున్నారని చెప్పారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు ఇక్కడే ట్రైనింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు పైబడిన ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు సుదూర ప్రాంతాల్లో ట్రైనింగ్‌కు పోవడం వల్ల అనారోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్‌తో ఎండీయూ ఆపరేటర్లు

నెల్లూరు (పొగతోట) : ఎండీయూ వాహన ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని ఎండీయూ ఆపరేటర్లు ఆదివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పట్టాభిని తొలుత సన్మానించారు. ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పదోన్నతులను హెచ్‌ఎంలకే ఇవ్వాలి


మాట్లాడుతున్న సంఘ నాయకులు

నెల్లూరు (టౌన్) : ఉప విద్యాశాఖాధికారి, డైట్ సీనియర్ అధ్యాపకులు తదితర పదోన్నతులను హెచ్‌ఎంలకే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ముత్తుకూరు రోడ్డులోని వైవీ లయన్స్ భవన్ సమావేశ మందిరంలో హెచ్‌ఎం సంఘం జిల్లా మహాసభ జిల్లా అధ్యక్షుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రాష్ట్ర, జిల్లా సంఘ నాయకులు చర్చించారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులుగా హెచ్‌ఎంలను నియమించాలన్నారు. ప్రధానంగా కామన్ సర్వీసు రూల్స్‌ను అమలు పరచాలని ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. అపార్‌ను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో బోధనేతర సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ ఉండే విధంగా విద్యాశాఖ మంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. నామినల్ రోల్స్ ఫైనల్ సబ్మిషన్ తేదీని పొడిగించాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ట్రెజరర్ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ట్రెజరర్ చలపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తగిన వ్యాయామంతో షుగర్‌కు చెక్


మాట్లాడుతున్న డాక్టర్ విశ్వకుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : స్థానిక ఏసీ స్టేడియంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ ఆస్పత్రి డాక్టర్ విశ్వకుమార్ మాట్లాడుతూ తగిన వ్యాయామం, డైట్ కంట్రోల్ ద్వారా షుగర్‌కు చెక్ పెట్టవచ్చని తెలిపారు. 300 మంది వాకర్స్‌తో పాటు అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, సెక్రటరీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా దీపోత్సవం

నెల్లూరు(బృందావనం) : స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కార్తీకమాస దీపోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు లలితా కుమారస్వామిచే పరమేశ్వర రూపానికి, 1008 మృత్తికా శివలింగాలకు రుద్రాభిషేకం, లింగార్చన నేత్రపర్వంగా జరిగింది. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ఆంజనేయులు, దుగ్గిశెట్టి అశోక్, సురేష్, సత్యనారాయణ, కిశోర్ పాల్గొన్నారు.




హోరాహోరీగా పోటీలు



నెల్లూరు (టౌన్) : నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల మైదానంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ స్థాయి ఉమెన్ పోటీలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ఖోఖోలో డీకేడబ్ల్యూ కళాశాల ప్రథమ, కావలి జేబీ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం సాధించారు. చెస్‌లో కేసీడీసీ డిగ్రీ కళాశాల ప్రథమ, కావలి శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వెంకటాచలం అలెక్సా బీపీఈడీ కళాశాల ప్రథమ, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, టగ్ ఆఫ్ వార్‌లో గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రథమ, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానాలు సాధించాయి. ఈ పోటీలు సోమవారం కూడా ఉంటాయని పీడీ విజయకళ తెలిపారు.

కల్యాణం.. కమనీయం



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మోదెం సత్యనారాయణగుప్తా– పూర్ణిమ దంపతులు వ్యవహరించారు. ఈఓ జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(బృందావనం) : ఆచారివీధిలోని నెల్లూరు క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్ హాల్లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గుండ్లపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శిగా చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారిగా అద్దెపల్లి సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కూచిపూడి డ్యాన్సర్ కొలపర్తి వెంకట శ్రీగుహ్య, సీనియర్ సిటిజన్ దేవిశెట్టి వెంకటసుబ్బయ్యను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, టి.ప్రకాశ్‌రావు, సీహెచ్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజల్లో భాగంగా ఆదివారం ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, శీవేలి ఉత్సవం జరిగింది. ఉభయకర్తలుగా పల్లంరెడ్డి విజయకుమార్‌రెడ్డి–వసంత, పల్లంరెడ్డి హర్షారెడ్డి– సంధ్యా, వేలూరు హరనాథరెడ్డి– గిరిజ, శివసునీల్‌రెడ్డి– సుధా దంపతులు వ్యవహరించారు. అన్నప్రసాదం ఉభయకర్తలుగా పుత్తూరు తులసిరాజు– సుజాత, గణేష్–సంధ్యా, భరత్– హేమ దంపతులు వ్యవహరించారు. గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, గడ్డం రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు బిర్సా ముండా


మాట్లాడుతున్న మేయర్ స్రవంతి


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు(బారకాసు) : స్వాతంత్య్ర సమరయోధుడు, జానపద నాయకుడు భగవాన్ బిర్సా ముండా ఆదర్శప్రాయులు అని నగర మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్పగుడి వద్ద గుర్రం బాబయ్య కల్యాణ మండపంలో విద్యార్థులకు బిర్సా ముండా జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం బిర్సా ముండా అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. కాగా వ్యాసరచన పోటీలకు దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నిర్వాహకుడు చేవూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై తీవ్ర పనిఒత్తిడి


మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు బషీర్

నెల్లూరు(అర్బన్) : సచివాలయ ఉద్యోగులను తీవ్ర పని ఒత్తిడికి గురి చేయడం తగదని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.బషీర్ అహ్మద్ అన్నారు. హరనాథపురంలోని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ఏకకాలంలో పలు శాఖల విధులు అప్పగించడమే కాకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులు ఒకే సమయంలో పర్యవేక్షిస్తున్నారన్నారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, పీవీఎస్‌టీ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారమందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానాయుడు, నాయకులు బాబూరావు, శ్రీధర్, నయాజ్, మనోజ్, విజయ్‌పవన్‌కుమార్, మస్తాన్‌బాబు, సుహాసిని, రామచంద్ర, సమీవుల్లా పాల్గొన్నారు.